క్లుప్తంగా

రేపు యర్రబాలెంలో మెగా వైద్య శిబిరం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యర్రబాలెం వేప చెట్టు సెంటర్‌లో నిర్వహించే వైద్యశిబిరంలో అన్ని రకాల జబ్బులకు ప్రత్యేక వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి షుగర్, బీపీ, టూడీ ఏకో పరీక్షలు, ఈసీజీ, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. షుగర్, గుండెజబ్బులు, నరాలు, జనరల్, కీళ్ల ఎముకలు, చిన్నపిల్లలకి, గైనకాలజీ, చర్మ, దంత, కంటి, ఆయుర్వేదం, ఫిజియోథెరపీలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇసుక లారీలు సీజ్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను శుక్రవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. ఎస్ఈబీ సీఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో ఎటువంటి వే బిల్లు లేకుండా ఇసుక లారీ వెళుతోందని సమాచారం రావడంతో సిబ్బంది తనిఖీ చేశారని, ఈ తనిఖీలో ఎటువంటి బిల్లులు లేకుండా వెళుతున్న ఏపీ 16 టీఎస్ 5819 లారీని, తాడేపల్లి పట్టణ పరిధిలోని సర్వీస్‌రోడ్‌లో ఏపీ 39 యూఎస్ 6147 లారీని, ఉండవల్లిలో ఏపీ 39 యూకే 7291 లారీలను పట్టుకుని, బిల్లులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి తాడేపల్లి పోలీసులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


ఫిరంగిపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యుడు దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 234 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల వద్దకు వెళ్లి పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు గురించి వారికి వివరించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాలు, గుడ్లు, క్యారెట్, బీట్ రూట్ వంటివాటిని తీసుకోవాలని చెప్పారు. హెచ్ఎస్ కొండపల్లి సుదర్శనరాజు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, బాబురావు, ఏఎన్ఎం ఆంథోనిరాణి, ఆశా వర్కర్లు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం దిశగా చర్యలు



లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి చెరువు పూర్తిగా ఎండిపోవడంతో ప్రత్యామ్నాయ చర్యల దిశగా బోర్లు వేయించారు. వీటికి పైప్‌లైన్ అనుసంధానం చేసే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వారంలోగా పనులు పూర్తిచేసి గ్రామంలో తాగునీటిని పునరుద్ధరించనున్నట్లు సర్పంచ్ అబీదా అలీ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రేపు సుద్దపల్లిలో బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరం



అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సీఈవో అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు, అనంతర వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు వివరించారు. నేత్ర సమస్యల నుంచి గ్రామస్తులందరికీ రక్షణ కల్పించటమే వైద్య శిబిరం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లను అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 12, 228మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 9082మందికి కళ్లజోళ్లను అందించినట్లు మురళీకృష్ణ చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- ఆత్మకూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



ఆత్మకూరులో జరిగిన కార్యక్రమానికి హాజరైన మహిళలు



బేతపూడిలో సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ



తాడేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కొత్తపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

మంగళగిరి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు 1వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం ఏపీకి జగన్ ఎందుకు కావాలి(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు గత నాలుగన్నర సంవత్సరాలుగా తాము అందుకున్న సంక్షేమ పథకాలను వివరించి మరలా తమకు సంక్షేమ పథకాలు ఇదేవిధంగా ఇంటి వద్దకే రావాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు చారిత్రాత్మకమన్నారు. ముఖ్యంగా సమాజ అభివృద్ధిలో కీలక భూమిక పోషించే విద్య, వైద్యాన్ని పేదలకు అందించడమే లక్ష్యంగా ఆయా రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మళ్లీ ఇదేవిధంగా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాలన్నా, పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ రూరల్ కన్వీనర్ అన్నపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, గ్రామ అధ్యక్షుడు బొమ్ము శివరామిరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సీతామహాలక్ష్మి, స్థానిక నాయకులు జలాది నాగేశ్వరరావు, గాలి సాంబయ్య, చిట్యాల శ్రీను, పులివర్తి రాంబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో...

నగరంలోని ఒకటో వార్డు కొత్తపేటలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ అధ్యక్షతన జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ మాధురి, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం కన్వీనర్ గంజి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు కుంచాల కృష్ణ కిషోర్, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి జగనన్న..

ఫిరంగిపురం: పేదలపాలిట పెన్నిధి జగనన్న అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలోని సచివాలయం వద్ద ఏపీ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి పథకాల ద్వారా వచ్చిన నిధులు, గ్రామాభివృద్ధి వివరాలు తెలియజేసే బోర్డును జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, సర్పంచ్ గంధూళి ఆదంబీలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కత్తిరేణమ్మ మాట్లాడుతూ అర్హత ఉంటేచాలు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్‌బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, అమూల్ పాలకేంద్రాలు వంటివి ఏర్పాటుచేసి ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సత్యానంద్, కార్యదర్శి లలితకుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్నివర్గాలకు సంక్షేమం..

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి 3వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సచివాలయ సిబ్బందితో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం సచివాలయం బయట పార్టీ జెండాను బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఆవిష్కరించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సచివాలయ సెక్రటరీ సాహితి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చినపోతుల దుర్గారావు, నాయకులు చాగంటి బాపిరెడ్డి, చాగంటి కోటిరెడ్డి, మేక వెంకట్‌రెడ్డి, వేముల శివయ్య, చాగంటి విద్యాధర్ రెడ్డి, బుర్రముక్కు శివారెడ్డి, చాగంటి ఓంకార్ రెడ్డి, పూర్ణచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

- తాడేపల్లి రూరల్‌పరిధిలోని చిర్రావూరు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, చిర్రావూరు అధ్యక్షుడు మేకల సాంబశివరావు, న్యాయవాది బాజీ గంగాధర్ ఆధ్వర్యంలో లైబ్రరీ సెంటర్ వద్ద ఉన్న ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కత్తిక రాఘవరావు, అమరా నాగయ్య, పార్టీ కుంచనపల్లి అధ్యక్షుడు మిరియాల రాంబాబు, జేసీఎస్ కన్వీనర్లు పల్లంపాటి సాంబశివరావు, జెట్టి బుల్లిబాబు, మల్లెబోయిన సుజాత తదితరులు పాల్గొన్నారు.
- దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, నోడల్ అధికారి శ్రీనివాసరావు, పంచాయితీ సెక్రటరీ లక్ష్మిలతో కలసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం చిలువూరులో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, మండల పార్టీ అధ్యక్షులు శృంగారపాటి రత్నం, ఎంపీపీ, జడ్పీటీసీలతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, కుర్ర సీతారామయ్య, పసుపులేటి మధుబాబు, ఉప్పాల సుబ్బారావు, వలంటీర్లు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

కొర్రపాడులో..

మేడికొండూరు: అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అంది, అందరూ ఆర్థికాభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ అన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అంది, అందరూ సంతోషంగా ఉండాలంటే వై.ఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, గ్రామ సర్పంచ్ బి.నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ మద్దు మరియదాసు, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, నరసింహారావు, జి.శ్రీను, లూర్థురాజు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా రాష్ట్రం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కత్తెర సురేష్ కుమార్



అనంతవరంలో పథకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

అనంతవరం(తాడికొండ): దేశంలోనే సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం పార్టీ జెండాను ఎగరేసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తూ 5 కోట్ల మంది ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటు అందించినందునే నేడు ప్రజలు జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత కనిపించకుండా పారిపోయేవని, కానీ నేడు అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నూరుశాతం అమలు చేసిన తరువాతే ప్రజలను ఓటు అడుగుతున్నారన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు పేదలకు ఒక్క సెంటు భూమి ఇచ్చిన దాఖలా ఎక్కడా లేదన్నారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయనివిధంగా సీఎం వైఎస్ జగన్ ఒక్క ఏపీలోనే 35 లక్షల ఇళ్ల స్థలాలు అందజేసి ఆ స్థలాల్లో 25 లక్షల ఇళ్లను నిర్మించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారన్నారు. అనంతవరం గ్రామంలో సంక్షేమ పథకాల కింద రూ. 21 కోట్లను అందించారని తెలియజేశారు. ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, శృంగారపాటి సందీప్, ఆరేపల్లి జోజి, బండ్ల శ్రీకాంత్, పి.రమేష్, డీజే శ్రీనివాసరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావెలలో..

తాడికొండ మండలం రావెల గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగరేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావెల శైలజ, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మశీ కళాశాలలో ఫార్మా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి

మంగళగిరి: సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రపంచంలో ఎంతో అభివృద్ధి సాధించినా ఈ రోజుకి మానవ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేకపోతున్నామని రక్త కొరతతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, కాబట్టి రక్తదాన అవసరాన్ని గుర్తించి, రక్తదానం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని మంగళగిరి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇసునూరి చక్రవర్తి పిలుపునిచ్చారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మశీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఫార్మా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఔషధాల వినియోగం, రక్తదానం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, సమన్వయకర్త ఆర్.నరసింహనాయక్, జాతీయ సేవా పథకం స్టూడెంట్ కో–ఆర్డినేటర్స్ జి.అమూల్య, ఎ.హర్షిత, రితేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం..

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులోని నిర్మల ఇంగ్లిష్ మీడియం స్కూలులో శుక్రవారం 73వ భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలనే ప్రాణవాయులను భారత రాజ్యాంగం కల్పించిందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెచ్ఎం సిస్టర్ జ్ఞానసుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కనకదుర్గ వారధి రేపల్లె కరకట్టపై చిర్రావూరు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఓ టిప్పర్ లారీ శుక్రవారం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామానికి చెందిన మొల్లబంటి శ్యామ్ రేపల్లె వైపు నుంచి కనకదుర్గ వారధి వైపుద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ సమయంలో కనకదుర్గ వారధి వైపు నుంచి చిర్రావూరుకు వేగంగా వెళుతున్న టిప్పర్ లారీ శ్యామ్ బైక్‌ను ఢీకొంది. ఘటనలో బాధితుడికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ధరణిధర్, పైలెట్ నరసింహారావులు సంఘటనా స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న శ్యామ్‌ను 108లోకి ఎక్కించి ప్రథమ చికిత్స నిర్వహించారు. ఈ ప్రమాదంలో శ్యామ్ ఎడమ కాలు తొడ వద్ద తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేతన్నకు అరుదైన గౌరవం

మంగళగిరి ముఖద్వారంగా నేతన్న విగ్రహం ఏర్పాటు




ప్రకాశం బ్యారేజ్ బకింగ్‌హామ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు విగ్రహం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ) ముఖద్వారమైన (ఎన్ఆర్ఐ జంక్షన్)కు నేతన్న సర్కిల్‌గా నామకరణం చేసి నేతన్న విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేసిన కృషి ఎంతో అభినందనీయమని చేనేత వర్గాలు కొనియాడుతున్నాయి. నేతన్న సర్కిల్‌లో 100 అడుగుల జాతీయ జెండాతో పాటు చుట్టూ గ్రీనరీ, విద్యుత్ వెలుగులతో రూ.60లక్షలతో సుందరంగా రూపుదిద్దుకున్న నేతన్న విగ్రహాన్ని శనివారం రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు ఆవిష్కరించనున్నారు.

నేడు టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు కార్పొరేషన్ అధికారులు పలు ముఖ్య కూడళ్లలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా ప్రకాశం బ్యారేజ్‌బకింగ్‌హామ్ కెనాల్ మూడు రోడ్ల కూడలి వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని నేడు ఆవిష్కరిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటలో తెలియజేశారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.

వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని వైద్యాధికారి పి.ఎస్తేరురాణి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం యాంటీబయోటిక్స్ నిరోధక శక్తి నివారణ వారోత్సవాల సందర్భంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు ఆధ్వర్యంలో ఆరోగ్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్తేరురాణి మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే జలుబు, దగ్గు వంటి వాటికి అధికంగా యాంటీబయోటిక్స్ వాడరాదని నిర్ణీత రోజుల్లోగా వాటిని వాడాలని చెప్పారు. యాంటీబయోటిక్స్ అధికంగా వాడటం వల్ల కాన్సర్, వ్యాధి నిరోధక శక్తి తగ్గుదల వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిపై ఈనెల 18నుంచి 24వ తేదీ వరకు ఇంటింటికి ఆరోగ్యసిబ్బంది వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తగిన మోతాదులో మాత్రమే యాంటీబయోటిక్స్ వాడాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈనెల 27,28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో ఏపీ రైతుసంఘం, కార్మిక సంఘాల నాయకులతో కలసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా అటు రైతాంగం, ఇటు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి రైతు విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 27,28 తేదీల్లో నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు, కార్మికులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, సీతయ్య, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సాహితీ కన్‌స్ట్రక్షన్స్‌పై చీటింగ్ కేసు నమోదు

మంగళగిరి: నగర పరిధిలోని కాజలో నిర్మాణంలో వున్న కంపెనీపై చీటింగ్ కేసు నమోదైన ఘటన చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాజలో సాహితీ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో అపార్ట్‌మెంట్స్, విల్లాలు నిర్మాణం చేయగా పలువురు అపార్ట్‌మెంట్స్‌లలోని ఫ్లాట్స్‌తో విల్లాస్‌ను బుక్ చేసుకుని అడ్వాన్స్‌లుగా రూ.కోట్లు కంపెనీకి చెల్లించారు. గడువు సమయం ముగిసినా నిర్మాణం పూర్తి చేయకపోగా, అడ్వాన్స్‌లు కట్టిన వారికి ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో కొనుగోలుదారులు పలువురు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుల బ్రోచర్ల ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు డైరెక్టర్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ బి. నాగరాజు మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై మార్చి 15 నుంచి 17 తేదీల్లో అంతర్జాతయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో....

నాగార్జున విశ్వవిద్యాలయ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ' నెట్ వర్కింగ్ అండ్ ఇంటర్ ఫేసింగ్ ఆఫ్ నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ యాక్షన్' అనే అంశంపై వచ్చే ఏడాది మార్చి 1, 2 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.